
యువ క్రీడాకారులు.. మట్టిలో మాణిక్యాలు 2


పొలం వద్ద విద్యుదాఘాతంతో 2



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in

11-3-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


## అర్బన్ అభివృద్ధిపై దృష్టి సారించాలి



**అక్షరటుడే, ఇందూరు:** అర్బన్ అభివృద్ధిపై శ్రద్ధ వహించాలని, ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా కోరారు. కలెక్టర్ ఇలా త్రిపాఠికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన యూజీడీ పనుల నిధుల విషయంలో ఇలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బోధన్ బస్టాండ్ సమీపంలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ మరమ్మతుల పనులు పూర్తి చేసి అర్హులకు కేటాయించాలని కోరారు.



## బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి

**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** ప్రభుత్వ రంగ బ్యాంకు సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నగర మేయర్ ఉమారాణి రమేశ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని కేసీఆర్ కాలనీలో పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ శాఖను మేయర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమారాణి మాట్లాడుతూ నిజామాబాద్ ప్రజలు బ్యాంక్ సేవలను వినియోగించు కోవాలని కోరారు. జిల్లాలోని మొట్టమొదటిసారిగా జిల్లాకేంద్రంలో బ్యాంక్‌ను ప్రారంభించినందుకు ఆమె అభినందించారు. నిజామాబాద్ బ్రాంచ్ మేనేజర్ సత్య వారపు కావ్య మాట్లాడుతూ స్థానికంగా ఉన్న ప్రజలు బ్యాంకు సేవలను సద్వినియోపరుచుకోవాలని కోరారు. తమ బ్యాంకులో గోల్డ్ లోన్, హోమ్ లోన్ సౌకర్యం ప్రజలకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 42వ డివిజన్ కార్పొరేటర్ సుశాంక్ రెడ్డితో కలిసి, బ్యాంక్ సిబ్బంది మాధవి కార్పొరేటర్ శశాంక్, మాజీ కార్పొరేటర్ బొట్టు వెంకటేష్, లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యతనివ్వాలి: ఎస్పీ రాజేష్ చంద్ర

**అక్షరటుడే, కామారెడ్డి:** పోలీస్ స్టేషన్లలో పారదర్శక సేవలు అందించాలని, సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సెక్షన్ ఇన్‌ఛార్జీల ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఎస్పీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల నుంచి వచ్చిన సెక్షన్ ఇన్‌ఛార్జీలతో మాట్లాడి, స్టేషన్లలో పిటిషన్ మేనేజ్‌మెంట్ సకాలంలో జరుగుతుందా లేదా అనే విషయాలను ఎస్పీ తెలుసుకున్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది అందరినీ సమన్వయం చేసుకుంటూ, ఎటువంటి పక్షపాతం లేకుండా పని విభజన జరగాలని సూచించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సెక్షన్ ఇన్‌ఛార్జీలకు ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి పౌరుడికి సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్ పద్ధతిలో సేవలు అందించాలని సూచించారు. చట్టంపై ప్రజలకు విశ్వాసం పెరగాలంటే బాధితులకు సమయానికి న్యాయం అందడం అత్యంత ముఖ్యమని ఎస్పీ పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా మాట్లాడి, వారి సమస్యలను శ్రద్ధగా విని, తక్షణ పరిష్కారం అందించేలా పోలీసు సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. విచారణ ప్రక్రియలో పారదర్శకత పాటించినప్పుడే పోలీస్ శాఖపై ప్రజల్లో గౌరవం మరింత పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి, పీసీఆర్ సీఐ నరేశ్, జిల్లాలోని వివిధ సెక్షన్ ఇన్‌ఛార్జీలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





# మండుతున్న ఎండలు

▸ వడదెబ్బ తగిలితే ప్రాణాంతకం ▸ బయటకు వెళ్తే జాగ్రత్తలు తప్పనిసరి

**వేసవికాలం వచ్చిందంటే చాలు దాహం పెరగడంతో పాటు నీరసం ఏర్పడుతుంది. ఉక్కపోతతో నానా తంటాలు పడాల్సి వస్తుంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతోంది. దాని ప్రభావం అందరిపై పడుతుంది. నిర్లక్ష్యం చేస్తే వడదెబ్బకు దారితీస్తుంది. అసలు వడదెబ్బ ఎందుకు తగులుతుంది.. సన్‌స్ట్రోక్ తగలకుండా ఏం చేయాలి... అనే అంశాలపై తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. - అక్షరటుడే, ఇందూరు**



ఉమ్మడి జిల్లాలో ఎండలు మండుతున్నాయి. దీంతో ఎండలో పని చేసే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరు ఎక్కువగా వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. శరీర సాధారణ ఉష్ణోగ్రత 37 డిగ్రీలు. అది దాటితే మానవ శరీరమే థర్మాటిక్ మెకానిజం పద్ధతిలో ఉష్ణోగ్రతలను సమం చేసేందుకు ప్రయత్నిస్తుంది. అందులో మార్పులు వస్తే మూడు రకాలుగా సంకేతాలిస్తుంది. అప్పటికి తీవ్రతను గుర్తించలేక పోతే అవయవాలపై ప్రభావం చూపిస్తుంది. తొలి దశలో ఒళ్లు కాలడం, తల, కండరాల నొప్పితో పాటు అలసట ఉంటుంది. రెండో దశలో ఎక్కువగా చెమటలు రావడం, తల తిరుగుడు, రక్తప్రసరణలో మార్పు వస్తుంది. ఇక మూడో దశలో వడదెబ్బ.. సకాలంలో వైద్యం తీసుకోన్నట్లయితే ప్రాణం పోయే అవకాశం కూడా ఉంటుంది.

### వృద్ధులపై ప్రభావం

అధిక ఉష్ణోగ్రతల ప్రభావం ఎక్కువగా చిన్న పిల్లలు 60 ఏళ్ల పైబడిన వృద్ధులు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులతో పాటు ఎండ లో పనిచేసే అందరి పైన ఉంటుం ది. పెద్దవాళ్ల మాదిరిగా చిన్నపిల్ల ల్లో నాడీ వ్యవస్థ పూర్తిగా అభివృద్ధి చెందదు. వృద్ధులు, వ్యాధిగ్రస్తులకు శరీర వ్యవస్థలో కొంత ఇబ్బంది ఉంటుంది. ఎండల్లో బిగుతుగా దుస్తులు వేసుకున్న వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంటుంది. ఇక ఎండలో పనిచేసేవారు జాగ్రత్తలు పాటిస్తూ ఉండాలి.

### జాగ్రత్తలు తప్పనిసరి...

ఎండాకాలం ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలి. ప్రధానంగా పెద్దవాళ్ళు అయితే రోజుకు సగటున కనీసం నాలుగు నుంచి 8 లీటర్ల నీళ్లు తాగాలి. వదులుగా ఉన్న కాటన్ దుస్తులు ధరించాలి. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటికి వెళ్లాలి. కచ్చితంగా తలకు రుమాలు, టోపీ ధరించాలి. పండ్ల రసాలు, కొబ్బరి బోండాలు తప్పితే శీతల పానీయాలు జోలికి వెళ్లొద్దు. కళ్లకు రక్షణగా కూలింగ్ గ్లాసులు వాడాలి.

**నాలుగు రోజులుగా జిల్లాలో ఉష్ణోగ్రతలు**

| వారం | ఉష్ణోగ్రత |
|---|---|
| ఆదివారం | 37.6 |
| సోమవారం | 38.4 |
| మంగళవారం | 37.8 |
| బుధవారం | 37.5 |

### వైద్యులను సంప్రదించాలి

వడదెబ్బకు గురైతే వెంటనే లక్షణాలు కనిపిస్తాయి. ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి. దాన్ని గుర్తించి జాగ్రత్తపడాలి. ఎక్కువగా ఎలక్ట్రోలైట్స్ తీసుకోవాలి. వీలైనంతగా నీడ పట్టున ఉండాలి. వడదెబ్బ తగిలిన వారిని నీడన పడుకొబెట్టాలి. శరీరాన్ని చల్లటి బట్టతో తుడువాలి. నీరు తాగించాలి.

## బ్రహ్మోత్సవాల్లో హోమాలకు అద్భుతశక్తి




**అక్షరటుడే, ఇందూరు:** బ్రహ్మోత్సవాల్లో నిర్వహించే హోమాలకు రెట్టింపు శక్తి ఉంటుందని దేవనాద జీయర్ స్వామి తెలిపారు. ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం సర్వరక్షకర సుదర్శన నరసింహ హవన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ.. ఆరోగ్యం, సంపద, మంచిబుద్ధిని సర్వ రక్షాకర సుదర్శన నరసింహ హోమం ప్రసాదిస్తుందన్నారు. కాదా నాలుగో రోజు బ్రహ్మోత్సవాల్లో బొమ్మరిల్లు సినిమా డైరెక్టర్ భాస్కర్, ప్రముఖ ఛాయాగ్రహకుడు విజయ చక్రవర్తి, సినీ నిర్మాతలు కృష్ణ, సత్యనారాయణ రెడ్డి, మహేందర్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు సినీ నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ రెడ్డి దంపతులు ప్రధాన ధర్మకర్త నరసింహా రెడ్డి దంపతులు విజయసింహారెడ్డి దంపతులు మాజీ ఎంపీటీసీ రాములు, నరాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ కట్టడాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని 8వ వార్డులో అక్రమ నిర్మాణాలపై తక్షణం కఠిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ మఠం పవన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఇటీవల కాలంలో అనుమతి లేకుండా భవన నిర్మాణాలు జరిగాయని కార్పొరేటర్ వివరించారు. తెలంగాణ మున్సిపాలిటీ చట్టం, టీఎస్‌బీపాస్ చట్టం ప్రకారం అనుమతి లేకుండా నిర్మాణాలు జరిగాయన్నారు. అలాగే అనుమతించిన ప్లాన్‌కు విరుద్ధంగా కూడా కొందరు బిల్డర్లు నిర్మాణాలు చేపట్టారన్నారు. ఇలాంటి అక్రమ నిర్మాణాలు ప్రజల భద్రత రహదారులు డ్రెయినేజీ వ్యవస్థ, రోడ్ల ఏర్పాటుకు తీవ్రమైన సమస్యలుగా మారాయని ఆయన పేర్కొన్నారు.

## జనగణన విధులను పక్కగా నిర్వహించాలి





**అక్షరటుడే, ఇందూరు:** జనగణన విధులను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం సంబంధిత శాఖల అధికారులు, తహశీల్దార్లకు శిక్షణా తరగతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2011లో చివరిసారిగా జనాభా గణన జరిగిందని గుర్తు చేశారు. వాస్తవానికి 2021లో ఈ ప్రక్రియలు చేపట్టాల్సి ఉండగా.. కరోనా వల్ల నిర్వహించలేదన్నారు. ప్రస్తుతం సాంకేతికతను వినియోగిస్తూ డిజిటల్ విధానంలో జనాభా లెక్కల సేకరణ జరిపేందుకు ప్రభుత్వ మార్గదర్శకాలు అనుగుణంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తొలి దశలో నివాస గృహాలతోపాటు అన్ని రకాల కట్టడాలు కుటుంబ వివరాలను సేకరించడం జరుగుతుందని చెప్పారు. రెండో విడతలో వ్యక్తిగత వివరాలు సేకరించాల్సి ఉంటుందన్నారు. కాగా శిక్షణ ఈనెల 13 వరకు మూడు రోజులపాటు కొనసాగుతుంది. కార్యక్రమంలో బోధన్ ఆర్మూర్ సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియా, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### రాజీవ్ గాంధీ ఆడిటోరియం ఆధునీకరణకు చర్యలు

నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంను ఆధునికీకరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఖలీల్‌వాడిలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియం, న్యూ అంబేద్కర్ భవన్‌లను సందర్శించారు. ఆడిటోరియం హాల్, పరిసరాలను నిశితంగా పరిశీలించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, సదస్సులు, సమావేశాలు నిర్వహించేందుకు ఆడిటోరియం అనువైనదిగా ఉన్నందున.. పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయాలని కలెక్టర్ సూచించారు. ఎయిర్ కండిషన్ సదుపాయం సైతం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీపీవో శ్రీనివాస్ రావు తదితరులు ఉన్నారు.

## వాటర్ ట్యాంక్ ఎక్కిన కలెక్టర్.. పరిశుభ్రత కార్యక్రమం పరిశీలన

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** జిల్లాలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు జోరుగా కొనసాగుతున్నాయి. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆధ్వర్యంలో అధికారులు నిత్యం పనులను పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం సదాశివనగర్ మండలంలో కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. మండలంలోని ఒకటో వార్డులో పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పరిశుభ్రత కార్యక్రమానికి కలెక్టర్ హాజరై పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్వయంగా ఆయన వాటర్ ట్యాంక్ పైకి ఎక్కారు. ట్యాంకులో కార్మికులు ఎల్లగారి బుచ్చయ్య, ప్రవీణ్ కార్మికులు నిర్వహిస్తున్న పరిశుభ్రత కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఎప్పటికప్పుడు ట్యాంక్‌లను శుభ్రం చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కార్మికులు విధులను సక్రమంగా నిర్వహిస్తే వారిని సన్మానించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ మేరకు పలువురిని సన్మానించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సీఈవో చందర్ ప్రత్యేక అధికారి సతీష్, డీఎల్‌పీవో శ్రీనివాస్, పంచాయతీ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నానో యూరియా వాడకంపై అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పంటల్లో నానో యూరియాను డ్రోన్ సాయంతో పిచికారీ చేయడం ద్వారా తక్కువ



సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో ఎరువులు వేయవచ్చని తెలిపారు. ఈ విధానం ద్వారా ఖర్చులు తగ్గడంతో పాటు పంటల దిగుబడి కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంభించి డ్రోన్ టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు నానో యూరియా ప్రయోజనాలు, డ్రోన్ ద్వారా పిచికారీ చేసే విధానం గురించి వ్యవసాయ శాఖ అధికారులు వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి, సిబ్బంది రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు రేపల్లెవాడ గ్రామ పంచాయతీ పరిధిలో మహిళల కోసం మహిళా భవనాన్ని ఏర్పాటు చేసినందుకు ఎమ్మెల్యే మదన్ మోహన్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు.



## రైతుహామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం

**అక్షరటుడే, కామారెడ్డి:** రైతులకు ఇచ్చిన హామీని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు చెలిమెల భాను ప్రసాద్ అన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా భానుప్రసాద్ మాట్లాడుతూ.. తమ ప్రభుత్వ హయాంలో రైతులకు పెట్టుబడి భరోసా ఉన్న రూ.10 వేలను రూ.15 వేలు చేసి ఇస్తామని రెండు విడతలు ఇచ్చి మూడో విడత ఎగ్గొట్టారన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయలేదని ఆరోపించారు. సరిపడా యూరియా అందజేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇవన్నీ అడిగిన రైతులపై కేసులు పెట్టి అరెస్ట్ చేస్తున్నారని భానుప్రసాద్ అన్నారు. వెంటనే రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా ఇచ్చామని కానీ అవి ఎక్కడికి పోయాయో తెలియవని సీఎం మాట్లాడడం చెప్పడం బాధ్యతారాహిత్యమన్నారు. రైతుల జోలికి వస్తే బీఆర్ఎస్ ఊరుకోదని, రైతుల పక్షాన ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రణాళిక కార్యక్రమానికి వచ్చే అధికారులు, నాయకులు మంత్రులను రైతులు నిలదీయాలన్నారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.



## ఎర్రజొన్న రైతులకు అన్యాయం

**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆర్మూర్ ప్రాంతంలోని ఎర్రజొన్న రైతులకు అన్యాయం జరుగుతోందని రైతు, వ్యాపారి యామాద్రి భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్కువ ధరకు ఎర్రజొన్నలను అమ్మవద్దని.. నిల్వ ఉంచుకోవాలని రైతులకు సూచించారు. ఆర్మూర్ ప్రాంతంలో 38ఏళ్లుగా ఎర్రజొన్న పంటను బైబ్యాక్ ఒప్పందం ద్వారా మూలవిత్తనాన్ని అందజేస్తూ కొనుగోలు చేస్తూ వచ్చారన్నారు. 15 ఏళ్లుగా బైబ్యాక్ ఒప్పందాలను తుంగలో తొక్కి అధికారుల అండదండతో విత్తన వ్యాపారులు రైతులను మోసం చేస్తున్నారన్నారు. ప్రస్తుతం కూడా విత్తన కమిటీలు సిండికేట్‌గా మారాయని తనకు సైతం ఫోన్ చేయగా తాను సిండికేట్‌లో చేరేది లేదని స్పష్టంగా చెప్పేశానన్నారు. గతంలో సైతం సిండికేట్‌లో చేరాలని తనపై కేసులు చేయించారన్నారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే ఒకరు కీలకపాత్ర పోషించారని ఆరోపించారు. ఎర్రజొన్నల ధర తగ్గడానికి మాజీఎమ్మెల్యే గ్రూపే కారణమని యామాద్రి భాస్కర్ అన్నారు. తాను సైతం కమ్మర్‌పల్లిలో బైబ్యాక్ ఒప్పందం మేరకు రూ.39కు మూల విత్తనాన్ని అందజేశానని ఇప్పుడు సైతం అదే ధరకు ఎర్రజొన్నలను కొనుగోలు చేస్తానన్నారు. గతంలో సైతం తనపై కక్షగట్టి తన రెండు కార్లు, గోదాంను సీజ్ చేస్తే హైకోర్టులో రిట్ వేసి గెలిచానన్నారు.



### యువ క్రీడాకారులు..

# మట్టిలో మాణిక్యాలు

■ సత్తాచాటుతున్న నస్రుల్లాబాద్ నెమ్లి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ■ ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలకు చేరే అవకాశం

**నస్రుల్లాబాద్ మండలం నెమ్లి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు రాష్ట్రస్థాయి వేదికలపై సత్తా చాటుతున్నారు. సాధారణ కుటుంబాల నుంచి వచ్చిన ఈ ముగ్గురు యువ క్రీడాకారులు చదువుతో పాటు వాలీబాల్ క్రీడలోనూ రాణిస్తున్నారు. పల్లెలో పెరిగిన ఈ మాణిక్యాలు ఇప్పుడు ఆటల మైదానంలో మెరిసే మెరుపులుగా మారి జిల్లాకు గౌరవాన్ని తెచ్చిపెడుతున్నారు.**

**- అక్షరటుడే, బాన్సువాడ**

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలకు అవసరమైన సదుపాయాలు పరిమితంగా ఉండడం సాధారణం. అయినప్పటికీ తమ పట్టుదలతో ప్రతిభను నిరూపించుకుంటున్నారు ఈ యువ క్రీడాకారులు. నస్రుల్లాబాద్ మండలం నెమ్లి ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకున్న విస్లావత్ నరేందర్, రాజశేఖర్, అబ్దుల్ చిన్నప్పటి నుంచే వాలీబాల్ ఆటపై ఆసక్తి పెంచుకున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు సురేందర్ పాఠశాల మైదానంలో ప్రతిరోజూ సాధన చేయించి సానబట్టడంతో విద్యార్థులు తమ ప్రతిభను మెరుగుపర్చుకున్నారు.

ప్రస్తుతం వీరిలో విస్లావత్ నరేందర్ కామారెడ్డి ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో డిగ్రీ ఫస్టియర్ చదువుతున్నాడు. రాజశేఖర్ బాన్సువాడలోని ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతూ వాలీబాల్‌లో ప్రతిభ కనబరుస్తున్నాడు. అబ్దుల్ బాన్సువాడలోని రేణుక వొకేషనల్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం అభ్యసిస్తున్నాడు. చదువుతో పాటు క్రీడల్లోనూ సమానంగా శ్రమిస్తూ తమ లక్ష్యాన్ని సాధించేందుకు ముందుకు సాగుతున్నారు. తాము చదవిన పాఠశాలకు గుర్తింపు తెస్తున్నారు.

### సీఎం కప్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో రెండోస్థానం

ఇటీవల నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీల్లో ఈ యువ క్రీడాకారులు తమ ప్రతిభతో ఆకట్టుకున్నారు. బాన్సువాడ నియోజకవర్గం తరఫున పాల్గొన్న ఈ జట్టు కామారెడ్డి జిల్లాస్థాయి వాలీబాల్ అండర్-18 టోర్నీలో మొదటి స్థానాన్ని సాధించింది. ఆ విజయంతో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన ఈ జట్టు రాష్ట్రస్థాయిలోనూ అద్భుత ప్రదర్శన కనబర్చి రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది.



### గ్రామీణ ప్రాంత నేపథ్యం

గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు కూడా సరైన మార్గదర్శకత్వం, కృషి ఉంటే రాష్ట్రస్థాయి వరకు ఎదుగుతారని వీరి విజయం స్పష్టం చేస్తోంది. పాఠశాల దశ నుంచే క్రీడలను ప్రోత్సహించడం వల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. ఈ యువ క్రీడాకారుల విజయంతో నెమ్లి గ్రామం మాత్రమే కాదు, మొత్తం బాన్సువాడ ప్రాంతం గర్విస్తోంది. ఇలాంటి ప్రతిభావంతులైన గ్రామీణ యువతకు ప్రభుత్వం, విద్యాసంస్థలు మరింత ప్రోత్సాహం అందిస్తే భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ క్రీడాకారులు రాణించే అవకాశాలు ఉన్నాయి.

## ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం



**అక్షర టుడే ఎల్లారెడ్డి:** మండలంలోని రేపల్లెవాడ జీపీ పరిధిలోని నాలుగు గ్రామాలు దాల్మలకపల్లి, సర్దార్ పూర్, రేపల్లెవాడ, మల్లాయపల్లి గ్రామాలకు సంబంధించిన మహిళా సమాఖ్య భవనం ప్రారంభోత్సవాలు బుధవారం నిర్వహించారు. ఎల్లారెడ్డి మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిపారు. ఈ సందర్భంగా మహిళలు ఎమ్మెల్యే మదన్ మోహన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ఎల్లారెడ్డి ఏఎంసీ ఛైర్మన్ రజిత వెంకటరామిరెడ్డి, నాలుగు గ్రామాల సర్పంచులు, గ్రామ అధ్యక్షులు, మహిళా అధ్యక్షులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## వేంపల్లిలో ఉపాధి హామీ పనుల పరిశీలన

**అక్షరటుడే, ముప్కాల్:** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వేంపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను సర్పంచ్ ఎట్టెం మహేష్ యాదవ్, ఎంపీవో గౌస్ మోహినొద్దీన్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించి, పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. అదేవిధంగా గ్రామంలో ఉన్న వాటర్ ట్యాంక్‌లను శుభ్రపర్చడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దేవేందర్, వార్డు సభ్యుడు దీపక్, ఫీల్డ్ అసిస్టెంట్ జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు మాజీ జడ్పీటీసీ అంత్యక్రియలు

**అక్షరటుడే, కామారెడ్డి/ఎల్లారెడ్డి:** తూప్రాన్ సమీపంలోని మాసాయిపేట వద్ద రోడ్డు ప్రమాదంలో రామారెడ్డి మాజీ జడ్పీటీసీ నారెడ్డి మోహన్ రెడ్డి మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే ఆయన మృతి విషయం తెలుసుకున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ బుధవారం తూప్రాన్ పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి వెళ్లి వైద్యులతో మాట్లాడారు. మోహన్ రెడ్డి పోస్టుమార్టం త్వరగా పూర్తయ్యేలా చూశారు. అనంతరం ఆయన మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను షబ్బీర్ అలీ ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఒక బలమైన నాయకుడిని కోల్పోయిందన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కాగా మోహన్ రెడ్డి అంత్యక్రియలు రేపు కామారెడ్డి పట్టణంలోని ఆయన నివాసంలో నిర్వహించనున్నారు.

## ఉర్దూ మీడియం విద్యార్థులకు రంజాన్ తోఫా పంపిణీ



**అక్షరటుడే, బాల్కొండ:** మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో బుధవారం విద్యార్థులకు రంజాన్ తోఫాలు పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ రెహమాన్ సమకూర్చిన పండుగకు సంబంధించిన సామగ్రిని 20 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మర్కజ్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ మజారుద్దీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని రుఖియా, లెక్చరర్ రెహమాన్, సయ్యద్ శంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ స్వాముల రాస్తారోకో



**అక్షరటుడే, బోధన్:** మండల కేంద్రంలో హనుమాన్ దీక్ష స్వాములు రాస్తారోకో చేపట్టారు. ఎడపల్లి మండలంలోని ఓ పాఠశాలలో పదో తరగతి చదివే విద్యార్థి హనుమాన్ దీక్షమాల వేసుకుని పాఠశాలకు హాజరయ్యాడు. పాఠశాలలో పనిచేసే మహిళా ఉపాధ్యాయురాలు మాల వేసుకున్న విద్యార్థితో అవమానకరంగా మాట్లాడిందని ఆరోపిస్తూ హనుమాన్ దీక్ష స్వాములు ఎడపల్లి మండల కేంద్రంలో రాస్తారోకో చేపట్టారు. వెంటనే ఉపాధ్యాయురాలిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మున్సిపాలిటీలో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం



**అక్షరటుడే, భీమ్‌గల్:** స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డులో శుక్రవారం దేవి ఆలయ సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొదిరే నాగమణి స్వామి, వైస్ ఛైర్మన్ జేజే లత నర్సయ్య ప్రారంభించారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయించడంతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యార్థం వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని.. నాణ్యతా ప్రమాణాలతో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముత్యాల సునీల్ కుమార్ సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మూడో వార్డు కౌన్సిలర్ తోట సతీష్, రెండో వార్డు కౌన్సిలర్ పర్స అనంతరావు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు నల్లూరి గంగమణి పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు టీకాల పంపిణీ



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని రుద్రారం గ్రామంలో పశువులకు ఉచిత గాలికుంటు టీకా వేసినట్లు పశువైద్యాధికారి అర్చన తెలిపారు. 158 ఆవులు, 122 గేదెలకు టీకాలు వేసినట్లు తెలియజేశారు. పశువులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలపాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సందీప, సెక్రెటరీ సిద్ధూ, మండల పశు వైద్యాధికారిణి అర్చన, అనిల్, మహబూబ్ పాల్గొన్నారు.

## నిజామాబాద్ బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీగా మానస



**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీగా మానస ఎన్నికయ్యారు. బుధవారం ఆమెను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మానస మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న నిజామాబాద్ బార్ అసోసియేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

## డ్రంకన్ డ్రైవ్‌లో పలువురికి జరిమానా

**అక్షరటుడే, ఇందూరు:** డ్రంకన్ డ్రైవ్‌లో పలువురికి భారీ జరిమానాలు విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. నగరంలో పోలీసుల డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా 22 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లుగా గుర్తించారు. ఈ క్రమంలో వారిని న్యాయస్థానం ఎదుట ప్రవేశపెట్టారు. ఇందులో 21 మందికి రూ.10వేల చొప్పున జరిమానాలు విధించగా ఒకరికి ఒకరోజు జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

## పొలం వద్ద విద్యుదాఘాతంతో ఆర్ఎంపీ మృతి



**అక్షరటుడే, బాన్సువాడ:** పొలంలో పనులు పర్యవేక్షిస్తుండగా విద్యుదాఘాతంతో ఆర్ఎంపీ వైద్యుడు మృతి చెందాడు. ఈ ఘటన వర్ని మండలం జాకోరాలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జాకోర గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు గంగాధర్ పొలం వద్ద ఉదయం పనులు చూసుకుంటుండగా.. ప్రమాదవశాత్తు కరెంట్ తీగ తగలడంతో షాక్ తగిలింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. గంగాధర్ గ్రామంలో ఆర్ఎంపీ వైద్యుడిగా సేవలందిస్తూ ప్రజలకు పరిచయస్తుడిగా ఉన్నారు. ఆయన ఆకస్మిక మరణంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.